నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | HYDERABAD

నేటి నుంచి మెట్రోలో 3 ఆఫర్లు

టికెట్ చార్జీల్లో ప్రయాణికులకు రాయితీలు

ప్రకటించిన ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తెలుగు సంవత్సరం ఉగాది నుంచి మెట్రో రైలు ప్రయాణికులకు 3 కొత్త ఆఫర్లను ప్రకటిస్తున్నామని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మెట్రో ప్రయాణికుల కోసం 3 ఆఫర్లు 6 నెలల పాటు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డ్, మెట్రో స్టూడెంట్ పాస్, సూపర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్లను మెట్రో ప్రయాణికులు ఈ నెల 9 నుంచే వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ... మెట్రో ప్రయాణికులకు కోసం ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ సరికొత్తగా కస్టమర్ లాయల్టీ ప్రోగ్రాంను పరిచయం చేస్తోందన్నారు. ఇందులో తరచుగా మెట్రోలో ప్రయాణించే వారికి పూర్తి ఆకర్షణీయంగా ఉంటుందని, ఎక్కువగా మెట్రో సేవలు వినియోగించుకుంటే ఎక్కువ రివార్డులు పొందవచ్చన్నారు. కొత్తగా ప్రారంభించిన కస్టమర్ లాయల్టీ ప్రోగ్రాం ద్వారా మెట్రో ప్రయాణికులు ఎంతో లబ్ధి పొందుతారని ఎల్ అండ్ టీ మెట్రో ఎం.డీ, సీఈఓ కేవీబీ రెడ్డి తెలిపారు.

ఐకియా ఎదురుగా.. 15 ఎకరాల్లో భారీ మాల్

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): ఐకియా ఎదురుగా మరో భారీ మాల్, మల్టీప్లెక్స్ నిర్మాణానికి రహేజా మైండ్ స్పేస్ కంపెనీ సన్నాహాలు చేస్తోంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా రవాణా ఆధారిత అభివృద్ధి ప్రాజెక్టు కోసం అప్పటి ప్రభుత్వం 15 ఎకరాలను ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థకు కేటాయించింది. ఈ స్థలాన్ని ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ సబ్ లీజు కింద కె.రహేజా కార్పొరేషన్, బ్రూక్‌ఫీల్డ్ సంస్థలకు గతేడాది అప్పగించింది. దీంతో ఆ స్థలంలో మాల్, మల్టీప్లెక్స్‌తో పాటు ఆఫీసు స్పేస్‌ను నిర్మించేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంది. ఇప్పటికే సెల్లార్ పనులు చేస్తున్నారు. భారీ బహుళ అంతస్తులతో పాటు 14 సినిమా స్క్రీన్‌లతో నిర్మించనున్నారు. ఇందుకు రూ.1232 కోట్లను వెచ్చించనున్నాయి.

కాంగ్రెస్‌లో చేరికకు ముందు

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనకాల ఉన్న స్థలంలో గత నెల 15న ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

కాంగ్రెస్‌లో చేరిక తరువాత

ఇటీవల ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తుడిచివేసిన దృశ్యం

ఫిరాయింపునకు నజరానా

కాంగ్రెస్‌లో చేరిన వెంటనే దానంకు ప్రభుత్వ భూమి అప్పగింత

700 గజాల సర్కారు స్థలం చుట్టూ రేకులతో ప్రహరీ

ఇది సర్కారు స్థలమంటూ రెవెన్యూ అధికారుల హల్‌చల్

కాంగ్రెస్ కండువా కప్పుకున్న తర్వాత అధికారుల మౌనరాగం

బంజారాహిల్స్, ఏప్రిల్ 8 : బంజారాహిల్స్ రోడ్డు నంబరు-3లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కొంతకాలం కింద నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. దాని పక్కనే సుమారు ఎకరం ప్రభుత్వ భూమి ఉంది. ఇంతకాలం దాని జోలికి పోని దానం నాగేందర్.. గత నెలలో దాదాపు 700 చదరపు గజాల వరకు మలుపుకొని రేకులతో ప్రహరీ ఏర్పాటు చేశారు. ఈ విషయం పై ఫిర్యాదు అందిన వెంటనే షేక్‌పేట రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రహరీ రేకులపై ఇది ప్రభుత్వ భూమి అని రాయడంతో పాటు సర్కారు స్థలమని బోర్డు కూడా పాతారు.

సీన్ కట్ చేస్తే..

గత నెల 17న సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే దానం నాగేందర్ రెండు, మూడు రోజుల తర్వాత అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకుంది తడవు... బోర్డు పై రాసిన సర్కారు స్థలమనే రాత మాయమైంది. రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలూ లేవు. సామాన్యుడు సర్కారు స్థలాన్ని సెంటు మలుపుకుంటే ముందు కూల్చివేసి ఆపై పోలీసు కేసులంటూ హడావిడి చేసే అధికార యంత్రాంగం ఇప్పుడు మౌనరాగం ఆలపిస్తున్నది.

రూ.20 కోట్ల పైమాటే..

ఇంతకీ... దానం మలుపుకున్న భూమి విలువ ఎంతో తెలుసా?! కనీసం రూ.20 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కాగా ఎమ్మెల్యే దానం నాగేందర్ భూ ఆక్రమణపై షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డిని వివరణ కోరగా..ఎమ్మెల్యే నివాసం వెనకాల ప్రహరీ గోడ కట్టడంతో పాటు రేకులు ఏర్పాటు చేసినట్లు గుర్తించామన్నారు. అయితే ఈ గోడలు తాత్కాలికమేనని, నిర్మాణ సామగ్రి ఉన్నందున వాటి రక్షణ కోసం కట్టారని, పనులు పూర్తయిన తర్వాత గోడలు తొలగిస్తామని ఎమ్మెల్యే దానం సెక్యూరిటీ సిబ్బంది చెప్పడంతో వాటిని తొలగించలేదని పేర్కొన్నారు.

మృతి చెందిన ఆద్య(ఫైల్)

ప్రాణం తీసిన ఈత సరదా..

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఎనిమిదేళ్ల బాలిక మృతి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 8 : ఈత సరదా ఓ చిన్నారి ప్రాణం తీసింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... జీడిమెట్ల ఎన్‌సీఎల్ సింధూ అపార్ట్‌మెంట్ ప్లాట్ 510లో నివాసం ఉంటున్న డోలి నిఖిల్‌కుమార్ కూతురు ఆద్య(8) కిడ్స్ వరల్డ్ స్కూల్లో రెండవ తరగతి చదువుతుంది. ఆద్యకు చిన్ననాటి నుంచి మాటలు రావు. ఆదివారం సాయంత్రం చిన్నారిని తన తండ్రి నిఖిల్‌కుమార్ తమ గేటెడ్ కమ్యూనిటీ ఆవరణలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌వద్దకు తీసుకెళ్లాడు. గత ఏడాది మాదిరిగా ఆద్యకు ఈత నేర్పించేందుకు పరికరాలతో తీసుకెళ్లగా.. తన తండ్రి సహాయంతో నేర్చుకుంటుంది. స్విమ్మింగ్ అనంతరం నిఖిల్ తన బట్టలు మార్చుకునేందుకు అక్కడే ఉన్న డ్రెస్సింగ్ రూంలోకి వెళ్లగా స్విమ్మింగ్‌పూల్ పక్కనే ఉన్న ఆద్య ఎలాంటి రక్షణ లేకుండా స్విమ్మింగ్ పూల్‌లో దూకింది. బట్టలు మార్చుకొని బయటకు వచ్చిన తండ్రికి కూతురు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. కాసేపటికి స్విమ్మింగ్‌పూల్‌లో ఆద్య విగతజీవిలా దర్శనమిచ్చింది. స్థానికుల సహకారంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేటర్ @ 36.7డిగ్రీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. మొన్నటి వరకు 40 డిగ్రీలు దాటి నమోదైన పగటి ఉష్ణోగ్రతలు సోమవారం నాటికి కొంత చల్లబడ్డాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి దగ్గరగా 36.7డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.3 డిగ్రీలు, గాలిలో తేమ 35శాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉష్ణోగ్రతలు కొంత తగ్గడంతో నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు.



జీడిమెట్ల డివిజన్ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అభివృద్ధి కోసం పాటుపడే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడిని గెలిపించుకోవాలి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కాంగ్రెస్, బీజేపీని చిత్తుగా ఓడించాలి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 8 : ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, కుర్చీ కోసం రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. ప్రజాభివృద్ధి కోసం పాటుపడే బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సోమవారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీడిమెట్ల డివిజన్ పార్టీ ముఖ్య శ్రేణులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. అధికారం కోసం పాకులాడే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజాభివృద్ధి కోసం ఎలా పాటుపడుతారని ప్రశ్నించారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్‌రెడ్డి, సమ్మయ్య నేత, మధుసూదన్ రాజు, కాలే నగేశ్, కాలే గణేశ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, విజయ్, హరీశ్, నదిమ్‌రాయ్, రాముడు యాదవ్, మల్లేశం, మహిళా నేతలు అరుణారెడ్డి, పద్మ, కల్పన, శ్రీదేవిరెడ్డి, విల్లారెడ్డి, జార్జ్, శ్యామల పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మైనార్టీ అభ్యర్థుల నుంచి స్వీకరణ

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 8 : యూపీఎస్సీ - (సివిల్ సర్వీస్- 2025) పరీక్ష 2024-2025 విద్యా సంవత్సరంలో ఉచిత కోచింగ్‌కు మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి వీణ ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, అన్ని రిజర్వుడ్ కేటగిరిలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రవేశం కోసం డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు ఈ నెల 22 లోపు WWW.TMREISTELANGANA.CGG.GOV.IN వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28న ఆదివారం ప్రవేశ పరీక్ష అన్ని జిల్లా కేంద్రాల్లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కేబుల్ బ్రిడ్జిపై వాహనాలు ఆపితే..

వెయ్యి జరిమానా

సెల్ఫీల కోసం ఫుట్‌పాత్ వాడుకోండి

మాదాపూర్, ఏప్రిల్ 8: దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ప్రమాదాలకు గురవుతున్నారని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ అన్నారు. కేబుల్ బ్రిడ్జిపై ఈ నెల 6న జరిగిన హిట్ అండ్ రన్ కేసులో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, ఎస్సైలు, సిబ్బందితో కలిసి కేబుల్ బ్రిడ్జిపై పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ మాట్లాడుతూ కేబుల్ బ్రిడ్జిని చూడాలనుకునే వారు కోహినూర్ వద్ద వాహనాలను ఆపి ఫుట్‌పాత్ ద్వారా నడుచుకుంటూ రావాలన్నారు. ప్రజల అవగాహన నిమిత్తం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. కేబుల్ బ్రిడ్జిపై వాహనాలను ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే రూ. వెయ్యి జరిమానా విధిస్తామని తెలిపారు. ఎస్సై వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.

చంపి.. సంబురపడి.. రీల్స్ తీసి

మిత్రుడి హత్యకు ప్రతీకారంగా యువకుడిని చంపిన నిందితులు

దుండిగల్,ఏప్రిల్ 8 : మిత్రుడిని చంపినందుకు ప్రతీకారంగా అతని మిత్రులు నిందితుడిని హత్య చేసి తమ పగ తీర్చుకున్నారు. అనంతరం రక్తపు మరకలతో ఉన్న కత్తులు, చేతులను చూపుతూ.. నృత్యాలు చేస్తూ , కేరింతలు కొడుతూ.. బైక్‌పై ఊరేగుతూ సంబురాలు చేసుకుంటూ వీడియో తీసి ఇన్‌స్టాలో పోస్ట్‌చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం... ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా, కాకినాడకు చెందిన పిల్లి తేజాస్ అలియాస్ తేజూ అలియాస్ డీల్(21) కుటుంబం 20 ఏండ్ల క్రితం వలసవచ్చి, బోరబండ, బీకేగూడలోని ఆంజనేయ స్వామి గుడి ప్రాంతంలో స్థిరపడింది. తేజూ తండ్రి గతంలోనే మృతిచెందగా తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో తేజూ స్థానికంగా ఉండే షేక్ షరీఫ్ అనే రౌడీషీటర్ గ్యాంగ్‌లో పనిచేశాడు. గత ఏడాది అక్టోబర్ 24న బోరబండలో జరిగిన తరుణ్‌రాయ్ అనే వ్యక్తి హత్య కేసులో తేజూ నిందితుడు. ఈ హత్యకేసులో జైలుకు వెళ్లిన తేజూ రెండునెలల క్రితం బెయిల్‌పై విడుదలయ్యాడు. తన మకాంను ప్రగతినగర్‌కు మార్చాడు. అతడి తల్లి మూడు రోజుల క్రితం వేములవాడకు వెళ్లింది. ఆదివారం రాత్రి తేజూ తన మిత్రులైన మహేశ్, శివప్ప, మహేశ్‌తో కలిసి మద్యం సేవిస్తుండగా...వీరికి షమీర్ నుంచి ఫోన్ వచ్చింది. తేజూ కూడా అక్కడే ఉన్నట్టు తెలుసుకున్న షమీర్ తన పగ తీర్చుకునేందుకు ఇదే సరైన సమయమని భావించాడు. షమీర్ తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో సిగరెట్ తాగేందుకని తేజూ, మహేశ్, శివప్ప, మహేశ్ రోడ్డుపైకి వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న షమీర్ అతడి అనుచరులు కత్తులు పట్టుకుని వెంబడించి అంబీర్‌చెరువు బతుకమ్మ ఘాట్‌వద్ద తేజూ తలపై బండరాయితో మోదడంతో కిందపడిపోయాడు. కడుపు, చాతీపై విచక్షణా రహితంగా 11సార్లు కత్తులతో పొడిచారు. దీంతో తేజూ అక్కడికక్కడే మరణించాడు.

ఘటనా స్థలం వద్ద ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ఉపేందర్ తదితరులు

కలకలం సృష్టించిన ఇన్‌స్టాగ్రాం రీల్స్!

తేజూ మరణించాడని నిర్ధారించుకున్న హంతకులు అక్కడే వీడియో తీయడంతో పాటు బైక్‌లపై వెళ్తూ రీల్స్ చేశారు. తేజూను చంపిన కత్తులకు రక్తమోడుతుండగా, తమ చేతులకు ఉన్న రక్తపు మరకలను చూపుతూ తరుణ్‌రాయ్ హత్యకు ప్రతీకారంగానే అతడిని చంపినట్లు పేర్కొంటూ సంబురాలు జరుపుకుంటున్న దృశ్యాలను ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్‌చేశారు. కాగా ఘటనా స్థలాన్ని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, బాచుపల్లి సీఐ ఉపేందర్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. కొంతమంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.